క్లుప్తంగా

మొక్కలు నాటిన విద్యార్థులు



అమలాపురంలో మొక్కలు నాటిన విద్యార్థులు

అమలాపురం టౌన్: పర్యావరణ పరిరక్షణ కోసం గురువారం స్థానిక శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు పట్టణంలోని పలు చోట్ల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహరావు, ప్రిన్సిపాల్ కె.మనోహర్, ఏవో కరాటం ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి డీఈవో అభినందన



ఉపాధ్యాయుడు బాలకృష్ణను అభినందిస్తున్న డీఈవో కమలకుమారి

అమలాపురం టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు కుంచే బాలకృష్ణను డీఈవో ఎం.కమలకుమారి అభినందించారు. గురువారం స్థానిక డీవైఈవో కార్యాలయంలో డీఈవో కమలకుమారిని పురస్కార గ్రహీత బాలకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఈవోతో పాటు విద్యాశాఖ ఏఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు కె.ఘన సత్యనారాయణ తదితరులు ఆయనను అభినందించారు.

ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



సత్యనారాయణను గజమాలతో సత్కరిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు తదితరులు

అల్లవరం: ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరి రావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంత్రి జోగి రమేష్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న కార్యదర్శి కేవీవీ సత్యనారాయణను తూర్పులంక సచివాలయంలో గురువారం దుశ్శాలువా, గజమాలతో ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు సత్యనారాయణ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి గంగాచలం, వీఆర్‌ఓ నార్ని వెంకటేశ్వరరావు, ఏఎస్ఎం జల్లి ద్వారకమణి, డీపీ యాంఢ్ర సూర్యలక్ష్మి, వీఈఏ మోటూరి బాలశ్రీదివ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముమ్మిడివరం: చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ తీగల మరమ్మతుల పనుల నిమిత్తం కాట్రేనికోన, ముమ్మిడివరం మండలాల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. కాట్రేనికోన విద్యుత్ సబ్‌స్టేషన్ 33/11 కేవీ పరిధిలో గ్రామాలతో పాటు ముమ్మిడవరం మండలంలోని అనాతవరం, సీహెచ్ గున్నేపల్లి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఐ.పోలవరం: స్థానిక సబ్‌స్టేషన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ ఎం.రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

నవోదయ దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంపు

అమలాపురం రూరల్: పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్న దరఖాస్తుల గడువును ఈ నెల 25వ తేదీ వరకూ పొడిగించినట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహార కిట్ల అందజేత

యానాం: స్థానిక బైపాస్‌సెంటర్‌లో యానాం తెలగా అభ్యుదయ సంఘం అధ్యక్షుడు కాటంశెట్టి రామ్మూర్తి జన్మదినం సందర్భంగా గురువారం గర్భిణులకు పోషకాహార కిట్లను అందజేశారు. కనకాలపేట ప్రభుత్వ పాఠశాలలో 300 మంది విద్యార్థులకు స్వీట్లు, పెన్నులు, కాంపస్ బాక్సులు, ప్యాడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో నిస్వార్థ సేవలతో ప్రజల్లో గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం కాటంశెట్టి రామ్మూర్తిని సత్కరించారు.

కాలువల్లోనే చెత్త.. కలగని కనువిప్పు..

- కలుషితమవుతున్న జలాలు
- అవగాహన లోపంతో అనర్థం



కొమరగిరి ప్రధాన పంట కాలువలో పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ఐ.పోలవరం: కొందరి నిర్లక్ష్యం, అవగాహన లోపం కారణంగా గోదావరి జలాలు కలుషితమవుతున్నాయి. కాలువ చెంతన నివాసముంటున్నవారు కాలువలో చెత్త వేయడంతో మండలంలోని ప్రధాన కాలువల్లో జలాలు కలుషితమవుతున్నాయి. ఆ నీటినే తాగునీటిగా ఉపయోగించుకుంటున్న పలు పంచాయతీల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం పరిస్థితిని మరింత దిగజారుస్తుంది.

అంతటా అదే పరిస్థితి

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ప్రధాన పంట కాలువలు దాదాపు 55 కిలోమీటర్లు, అనుసంధాన పిల్ల కాలువలు 250 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. ఆయా పంట కాల్వలు, గ్రామాల్లోని డ్రెయిన్లు డస్ట్ బిన్‌ల్లా తయారయ్యాయి. కాలువల ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలు ప్రవహించి లాకులు, స్లూయిస్‌ల వద్ద అడ్డుపడి అటు ప్రవాహాన్ని అడ్డుకోవడమే కాకుండా కాలుష్యానికి కారణమవుతున్నాయి. కాలువల్లో చెత్త అడ్డుపడడం వల్ల శివారు ప్రాంతాలకు కాలువ నీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైగా పలుచోట్ల రొయ్యలు, చేపల చెరువుల వ్యర్థాలు, సెప్టిక్ క్లీన్ వ్యర్థాలు, ఇతర వ్యర్థాలు సైతం కాలువల్లోకి వదిలేస్తున్నారు. ఇప్పటికే స్థానికంగా రొయ్యలు చెరువుల తవ్వకాలు పెరిగిపోయి ప్రజలకు సురక్షిత మంచి నీరు కరవవుతోంది. ప్రభుత్వ స్వచ్ఛభారత్ అంటూ ప్రచారం చేస్తున్నా ఫలితం కానరావడం లేదు.

రోగాల బారిన ప్రజలు

కాలువల పక్కనే ఉంటున్న నివాసాలు, హోటళ్లు, చిరు వ్యాపార సంస్థల నుంచి చెత్తను నేరుగా కాలువల్లోకే పొడేస్తున్నారు. పైగా మద్యం షాపుల నిర్వాహకులైతే చెత్తతో పాటు ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ ప్లేట్లు సైతం కాలువల్లో డంప్ చేస్తున్నారు. దీనివల్ల పరిసరాలు అపరిశుభ్రంగా తయారై ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల్లో చెత్త వేయకుండా ప్రత్యేక దృష్టి సారించాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

పర్యవేక్షణ కరవు

చెత్త ఎక్కడపడితే అక్కడ వేసేయడం వల్ల కాలువలు, చెరువులు పూర్తిగా కలుషితమవుతున్నాయి. ప్రధానంగా రొయ్యలు, చేపల చెరువుల వల్ల స్వచ్ఛమైన నీరు కలుషితమవుతుంది. ఈ సమస్యపై అధికారుల పర్యవేక్షణ కరవైంది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలి.
– ఎస్.రవి ప్రసాద్, మురమళ్ల

కాలువ నీరంతా కలుషితం

చెత్త కారణంగా గోదావరి నుంచి వచ్చే తాగునీరు పూర్తిగా కలుషితమవుతుంది. ఇళ్లల్లో, వ్యాపార సంస్థల్లో వచ్చే చెత్తనంతా తీసుకొచ్చి కాలువల్లో పడేయడం వల్ల ఆయా పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారిపోతున్నాయి. పైగా ఆ నీటిని తాగే మూగజీవాలు రోగాల బారిన పడుతున్నాయి. దీనిపై అందరినీ చైతన్యవంతుల్ని చేయాల్సిన అవసరముంది. – సాధనాల రంగనాయకులు, కొమరగిరి

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- పోలేకుర్రులో గడప గడపకూ మన ప్రభుత్వం



పోలేకుర్రులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. పోలేకుర్రు పంచాయతీలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పలుచోట్ల మహిళలు ఎమ్మెల్యే పొన్నాడకు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇంటి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేస్తూ నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, స్థానిక సర్పంచ్ వెంటపల్లి సూకరాజు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, ఎంపీటీసీ సభ్యురాలు బళ్ల సంధ్యారాణి, కాపవరపు శ్రీదేవి, నాయకులు కొపనాతి నాగరాజు, ఎరికే వీరబాబు, రేవు మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్ ఉద్యోగుల పక్షపాతి

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి చిత్రపటానికి క్షీరాభిషేకం కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్, సెర్ప్ ఉద్యోగులు

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉద్యోగుల పక్షపాతి అని, సెర్ప్ ఉద్యోగులకు 23 శాతం జీతం పెంపు హర్షణీయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. జీతం పెంపుపై కృతజ్ఞతలు తెలియజేస్తూ సెర్ప్ ఉద్యోగులు గురువారం అమలాపురం భట్నవెల్లిలోని మంత్రి విశ్వరూప్ నివాసంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏపీడీ జిలానీ, డీపీఎం విజయ్‌కుమార్, జేఏసీ అధ్యక్షుడు డి.వరాలబాబు, కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, శామ్యూల్, పీవీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు నేలకూలిన టీడీపీ ఫ్లెక్సీలు



నేల కూలుతున్న టీడీపీ ఫ్లెక్సీ నుంచి తప్పించుకుంటున్న ఓ సైకిలిస్ట్



అమలాపురం గడియారం స్తంభం సెంటరులో ఈదురు గాలులకు నేలకూలిన టీడీపీ ఫ్లెక్సీలు

పలువురికి త్రుటిలో తప్పిన ప్రమాదం

అమలాపురం టౌన్: టీడీపీ అధినేత చంద్రబాబు రాక సందర్భంగా అమలాపురం గడియారం స్తంభం సెంటరులో ఏర్పాటుచేసిన భారీ ఫ్లెక్సీలు గురువారం మధ్యాహ్నం వీచిన ఈదురుగాలులకు నేలకూలాయి. ఆ సమయంలో అటుగా వెళుతున్న ద్విచక్రవాహనదారులు, సైకిలిస్టులు, పాదచారులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వాస్తవానికి చంద్రబాబు పర్యటన శుక్రవారం సాయంత్రం ఉంది. అయితే స్థానిక టీడీపీ నాయకులు అత్యుత్సాహంతో ట్రాఫిక్ ఎక్కువగా ఉండే గడియారం స్తంభం సెంటరులో బుధవారం రాత్రే భారీ ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. దీనివల్ల తమ దుకాణాలకు వెళ్లేందుకు తోవ లేక అటు దుకాణదారులు, ఇటు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చంద్రబాబు సభ శుక్రవారం సాయంత్రం కాబట్టి గురువారం రాత్రి ఫ్లెక్సీలు కట్టుకుంటే సమంజసంగా ఉండేదని వ్యాపారులు వాపోతున్నారు.

రైతులకు అండగా నిలవాలి



నంగవరంలో ఏఎంసీ సభ్యులను సత్కరిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరరావు

ఉప్పలగుప్తం: మార్కెట్ కమిటీ సభ్యులు రైతులకు అండగా నిలిచి కష్టానికి తగిన ప్రతిఫలం అందేలా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఇటీవల అమలాపురం మార్కెట్ కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన పలువురు నాయకులను సర్పంచ్ వెంకటేశ్వరరావు నంగవరం సచివాలయంలో గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఏఎంసీ వైస్ చైర్మన్ బడుగు మేరీకుమారి, డైరెక్టర్‌లు చప్పిడి దుర్గారావు, నిమ్మకాయల కోటేశ్వరరావు, అంగాని సీతామహాలక్ష్మిలను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి, మాజీ సర్పంచ్ శీలం సూరిబాబు, జంపన బాపిరాజు, రాయపురెడ్డి నాగు, కోలా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి వెండి పతకం



విద్యార్థికి సాయిబాబా వెండి పతకాన్ని అందిస్తున్న డాక్టర్ ప్రభాకర్

అమలాపురం టౌన్: పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన స్థానిక కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి కర్రి పవన్‌రామ్ సాయికి అమలాపురం డివిజన్ శ్రీసత్య సాయి బాబా సేవా సంస్థ తరఫున కో ఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ వెండి పతకాన్ని గురువారం పాఠశాలలో అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో పవన్ రామ్ సాయి 600 మార్కులకు గాను 562 మార్కులు సాధించి ఈ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ, సత్య సాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎల్‌డీసీ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ), స్టోర్‌కీపర్-గ్రేడ్ 3 ఉద్యోగాలకు ఈ నెల 27న నిర్వహించనున్న రాతపరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని డీపీఏఆర్ శాఖ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే తమ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల హాల్‌టికెట్లు ఉంచామన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ

అమలాపురం రూరల్: పాలగుమ్మి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.జయశ్రీ తన తండ్రి పవనమూర్తి జ్ఞాపకార్థం రూ.25 వేల విలువైన 50 జతల క్రీడా దుస్తులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటేశ్వరరావుకు గురువారం అందజేశారు. విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణ చేసిన జయశ్రీని ఉపాధ్యాయులు అభినందించారు.

ఉచిత వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో ఇటీవల కాలంలో కుక్క కాట్లు ఎక్కువగా నమోదైన క్రమంలో జిల్లా ఆపిడిమోలజిస్ట్ డాక్టర్ పావని స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని గురువారం సందర్శించి కుక్కల సమస్యపై కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడితో చర్చించారు. ఎవరైనా కుక్కకాట్లకు గురైతే ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న వ్యాక్సినేషన్లు, మందులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అమలాపురం, రామచంద్రపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రులతో పాటు కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో యానిమల్ బైట్ క్లినిక్‌లు ఏర్పాటు చేశామన్నారు.

సేంద్రియ పంటలతో ఆరోగ్యానికి మేలు



విలసవిల్లిలో రైతులకు విత్తనాల కిట్లను అందిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. మండలంలోని విలసవిల్లి గ్రామంలో సర్పంచ్ ఊర్మిళాదేవి ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల ఆర్థిక సహకార సంస్థ ద్వారా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు వ్యవసాయ పనిముట్లు, విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఊర్మిళాదేవి మాట్లాడుతూ పీఎంఏజేఏవై పథకంలో భాగంగా అందిస్తున్న 12 రకాల విత్తనాలను సాగు చేసి పండించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, జి.రామకృష్ణ, కె.మల్లికార్జునరావు, ఎం.సూరిబాబు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



తిళ్లకుప్పలో వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఐ.పోలవరం: మండలంలోని తిళ్లకుప్ప గ్రామంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ బి.భవాని, ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయి, ఏడీఏ రాజశేఖర్‌లు గురువారం పంట పొలాలను పరిశీలించారు. రైతు కడియం బుజ్జిబాబు పొలంలో ఆకునల్లి ఉన్నట్లు గుర్తించారు. ఆకునల్లి నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు ఒక లీటరు నీటికి లేదా డైమిథోమేట్ 2 ఎంఎల్ ఒక లీటరు నీటికి, ప్రొఫినోపాస్ 2 ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి ఆకు అడుగు భాగం తడిచేలా పిచికారీ చేయాలన్నారు. అనంతరం వరి పంట పొలాల్లో మేలైన యాజమాన్య పద్ధతులపై ఆత్మ ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయి మాట్లాడుతూ మండల మహిళా సమాఖ్య ప్రాంగణంలో వరి రైతులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై వ్యవసాయ సహాయ సంచాలకులు ఏవీఎస్ రాజశేఖర్ వివరించారు. డాట్ కోఆర్డినేటర్ డాక్టర్ భవాని మాట్లాడుతూ వరిని ఆశించే తెగుళ్లు, పురుగులు, సస్యరక్షణ పద్ధతులపై వివరించారు. కార్యక్రమంలో ఏఓ ఎం.వాణి, రైతులు ఉన్నారు.

సర్పంచ్‌ను పరామర్శించిన మంత్రి విశ్వరూప్



సర్పంచ్ అరుణను పరామర్శిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న పేరూరు సర్పంచ్ దాసరి అరుణను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ గురువారం పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, యువజన విభాగం అధ్యక్షుడు కేతా భానుతేజ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో సత్తిబాబు

అమలాపురం రూరల్: ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ నూరు శాతం పారదర్శకంగా రూపొందించడానికి బూత్ స్థాయి అధికారులకు ఏజెంట్లు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ చాంబర్‌లో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటర్ల జాబితా ఇంటింటి సర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకూ జిల్లాలో 56 శాతం ఇంటింటి సర్వే ప్రక్రియ పూర్తయిందన్నారు. మండపేట, కొత్తపేట మండలాల్లో సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. మూడు కిలోమీటర్ల పరిధి దాటకుండా ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరితే వేరే భవనాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేస్తామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపు, తాగునీరు, విద్యుత్ సరఫరా, టాయిలెట్ వంటి కనీస వసతులు ఉండేలా చూస్తామన్నారు. జిల్లాలో 22,000 మంది వికలాంగ ఓటర్లున్నారని, వారి పేర్లను టిక్ మార్క్‌తో ఓటరు జాబితాలో నమోదు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు వెంకయ్యనాయుడు, వడ్డీ నాయుడు, మహమ్మద్ అలీ, కారం వెంకటేశ్వరరావు, చిలకమర్తి కస్తూరి, నూకఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేస్తాం

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్



ప్రభుత్వ ఆసుపత్రిలో మెటర్నటీ వార్డు, ఓపీడీ బ్లాకల నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పేర్కొన్నారు. పీడబ్ల్యూడీ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని డ్రెయినేజీల ఆధునీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. భారీ వర్షాలు వస్తే గతంలో నీరు నిలిచిపోయేదని, భవిష్యత్‌లో అలాంటి అవకాశం లేకుండా పనులు చేస్తున్నామన్నారు. అనంతరం మెట్టకూరు గ్రామ పరిధిలోని మూడు తూముల జంక్షన్ మెయిన్ రోడ్డు పనులకు, మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మెటర్నటీ వార్డు, ఓపీడీ బ్లాక్, గిరియాంపేట వాటర్‌ట్యాంకు అభివృద్ధి పనులకు సైతం శ్రీకారం చుట్టారు. అదేవిధంగా దరియాలతిప్ప ఓహెచ్‌టీ పంపుసెట్, మోటార్లను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, పీడబ్ల్యూడీ ఈఈ సెల్వం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉప ఎన్నికల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి రెడ్డి భాగ్యలక్ష్మి తదితరులు

తాళ్లరేవు: జార్జిపేట గ్రామ పంచాయతీ ఉప ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రచారం గురువారంతో ముగిసింది. ఈ పంచాయతీలో సర్పంచ్ పదవికి పోటీచేస్తున్న వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి రెడ్డి భాగ్యలక్ష్మి చివరిరోజు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. భాగ్యలక్ష్మికి మద్దతుగా ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ తదితరులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ పెట్ల సూర్యనారాయణ రాజు, పెట్ల శాంతకుమారి, మందపల్లి రాంబాబు, దడాల జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానం కోసం.. శవపేటికతో ధర్నా

తాళ్లరేవు: తమ గ్రామానికి శ్మశానం కావాలంటూ గాడిమొగ పంచాయతీ బాబానగర్ వాసులు గురువారం శవపేటికతో ధర్నా నిర్వహించారు. గ్రామానికి చెందిన బొక్కా సత్యం అనే వృద్ధుడు మృతి చెందడంతో తమకు శ్మశానం కావాలంటూ శవపేటికలో మృతదేహాన్ని ఉంచి గాడిమొగ రహదారిలో బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా చనిపోతే అడవిలోకి వెళ్లి దహన సంస్కారాలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ ఎస్.పోతురాజు ఆదేశాల మేరకు స్థానిక వీర్వో పలివెల అర్జునరావు ఆందోళనకారులతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు. పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిలో దహన సంస్కారాలు చేసుకోవాల్సిందిగా చెప్పడంతో ఆందోళన విరమించి మృతదేహాన్ని ఖననం చేశారు.

అక్రమ మద్యం పట్టివేత

యానాం: నియోజకవర్గ శివారు గిరియాంపేటలోని కొప్పాడి గంగాధర్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా దాచిన 174 మెన్స్ చాయిస్ బాటిళ్లు, 30 హేవార్డ్స్ టిన్ బీర్‌లు పట్టుకున్నట్లు ఎస్ఐ కట్టా సుబ్బరాజు గురువారం తెలిపారు. మొత్తంగా పట్టుకున్న రూ.15,500 విలువ చేసే మద్యాన్ని సీజ్ చేసి ఎక్సైజ్ శాఖకు అప్పగించామన్నారు.

కలెక్టర్‌కు వినతి పత్రం

ముమ్మిడివరం: సర్వే ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు సర్వే ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి సాయిబాబు గురువారం వినతి పత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసినవారిలో రెవెన్యూ జేఏసీ రాష్ట్ర చైర్మన్ వీఎస్ దివాకర్, ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ తదితరులున్నారు.